సాక్షి సూర్యాపేట

సోమవారం । 23 । జూన్ । 2025



ప్రభాకర్‌రెడ్డి.. ప్రతిభావంతుడు

దివంగత నటుడు, దర్శక–నిర్మాత ప్రభాకర్‌రెడ్డి ఎంతో ప్రతిభావంతుడని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. - 8లో



రాజకీయంగా ఎదగాలి

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. - 8లో



ఉచిత విద్య, వైద్యం అందించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. - 8లో

పక్కాగా ఎకో క్లబ్‌లు

విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ నిర్ణయం



- గతేడాది ఆశించిన స్థాయిలో అమలుకాని కార్యక్రమం
- జూలై 29లోపు కమిటీలు వేయాలని ఆదేశం
- ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ పేరుతో ఏడు అంశాలపై ప్రచారం
- ప్రతి పాఠశాల నుంచి ఒక కమిటీ ఏర్పాటు

సూర్యాపేటటౌన్ : పచ్చదనం పెంచుతూ పర్యావరణాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా మొక్కల ప్రాధాన్యంతోపాటు వివిధ అంశాలపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కల్పించేందుకు కేంద్ర విద్యా శాఖ చర్యలు చేపట్టింది. పర్యావరణ సంబంధిత కార్యకలాపాల నిర్వహణలో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం ఎకో క్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ క్లబ్‌లను ఈ విద్యాసంవత్సరం నుంచి 'ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్'గా పిలవనున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లోనూ కొత్త క్లబ్‌ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది ఇవి ఆశించిన స్థాయిలో పనిచేయకపోవడంతో ఈ సంవత్సరం పకడ్బందీగా నిర్వహించేలా జిల్లా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు.

ఏడు అంశాలు ఇవే..
ఇంధన పొదుపు
నీటి పొదుపు
సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దు
సుస్థిర ఆహార వ్యవస్థ
వృథాను అరికట్టడం
ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడం
వ్యర్థాల రీసైక్లింగ్

పాఠశాలల వివరాలు	
ప్రభుత్వ పాఠశాలలు	950
మోడల్ స్కూల్స్	9
కేజీబీవీలు	19
మినీ గురుకులాలు	4
రెసిడెన్షియల్స్ స్కూల్స్	8
ప్రైవేట్ పాఠశాలలు	398
విద్యార్థుల సంఖ్య : లక్ష మందికిపైగా	

వచ్చే నెలాఖరులోగా..

వచ్చేనెల 29 వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 16 నుంచి ఈ ప్రక్రియ మొదలుపెట్టారు. ప్రతి తరగతి నుంచి చురుగ్గా ఉన్న నలుగురు లేదా ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి టీచర్లను, పాఠశాల కమిటీ చైర్మన్‌ను క్లబ్‌లో భాగస్వాములు చేయనున్నారు. పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు ఇందులో సభ్యులుగా ఉండాలి. ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఏడు అంశాలకు సంబంధించిన యాక్టివిటీ ఫొటోలు, వీడియోలు తీసి ప్రత్యేక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.

ప్రతి స్కూల్ నుంచి ఒక కమిటీ

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 950, మోడల్ స్కూల్స్ తొమ్మిది, కేజీబీవీలు 19, నాలుగు మినీ గురుకులాలు, ఎనిమిది రెసిడెన్షియల్స్ స్కూల్స్, 398 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో లక్ష మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో ప్రతి పాఠశాల నుంచి ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ ప్రజా ఉద్యమంగా చేపట్టిన ఏడు అంశాల్లో ఎకో క్లబ్‌లను భాగస్వామ్యం చేస్తారు.

అన్ని స్కూళ్లలో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎకో క్లబ్‌లు ఎంతో ఉపయోగపడతాయి. అన్ని స్కూళ్లలో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశాం. కేటాయించిన అంశాల వారీగా ఏడాదిపాటు కార్యక్రమాలు నిర్వహించాలి. రోజూ నిర్వహించే కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను ప్రత్యేక పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

– దేవరశెట్టి జనార్దన్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

తాగి నడిపితే జైలుకే!





ఇటీవల పోలీసులకు పంపిణీ చేసిన బ్రీత్ ఎనలైజర్

- జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- పట్టుబడితే జరిమానాతోపాటు, జైలు శిక్ష

సూర్యాపేటటౌన్ : మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాగి నడిపేవారిని ఎక్కడికక్కడ కట్టడి చేసేందుకు కృషి చేస్తున్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయకుండా రోడ్డు ప్రమాదాల నివారణకు పాటు పడాలని పోలీసులు అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. అయినా కొంత మంది మత్తులో నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. ఈ ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్కడికక్కడ డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. పట్టుబడిన వారికి జరిమానాలతో పాటు జైలు శిక్షలు సైతం విధిస్తున్నారు. ఇటీవల ఎస్పీ పలు పోలీస్ స్టేషన్లకు అత్యాధునిక బ్రీత్ ఎనలైజర్లు పంపిణీ చేశారు.

200 పాయింట్లు దాటితే జైలు శిక్ష

డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ పోలీసులకు పట్టుబడిన వారిల్లో ఎక్కువగా యువతే ఉంటున్నారు. ఒక్కోసారి పిల్లలు చేసిన తప్పులకు తల్లిదండ్రులు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. సమాజంలో సైతం చెడు పేరు తెచ్చుకునే పరిస్థితి తలెత్తుతోంది. మద్యం మత్తులో డ్రైవింగ్ చేసిన వారికి బ్రీత్ అనలైజర్‌తో టెస్టులు నిర్వహించి పాయింట్ల ఆధారంగా జరిమానాలు విధిస్తున్నారు. 50 నుంచి 100 పాయింట్ల వరకు రూ.వేయి వరకు జరిమానా, 100 నుంచి 200 పాయింట్లు వస్తే రూ.2వేల జరిమానా విధిస్తున్నారు. 200 పాయింట్లు దాటితే జైలు శిక్ష సైతం పడే అవకాశం ఉంది.

జీవితాలను నాశనం చేసుకోవద్దు

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వారితో పాటు ఇతరులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇలాంటి వారు పోలీసుల నుంచి తప్పించుకునే అవకాశం లేకుండా పూర్తిస్థాయిలో నిఘా ఉంచాం. ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. యువత మద్యం మత్తులో డ్రైవింగ్ చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దు.

– నరసింహ, ఎస్పీ

నమోదైన కేసులు ఇలా..

సంవత్సరం	కేసులు	జైలు శిక్ష
2023	22,875	10
2024	12,940	15
2025(ఇప్పటి వరకు)	7500	30

న్యూస్‌రీల్

రూ.327.39 కోట్ల రైతు భరోసా డబ్బులు జమ

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద ఇప్పటివరకు జిల్లాలోని 2,91,292 మంది రైతులకుగాను 2,76,787 మంది రైతుల ఖాతాల్లో రూ. 327.39 కోట్లు నిధులు జమయ్యాయి. ఈమేరకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగుల నూతన వేతన సవరణ నివేదిక ప్రకటించాలి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రాములు

సూర్యాపేటటౌన్ : రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణ నివేదికను వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సోమయ్య అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి రెండు సంవత్సరాల కాలం పూర్తయినా ఇంతవరకు పీఆర్సీ రిపోర్టు ప్రభుత్వం విడుదల చేయలేదని, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. వేతన సవరణ రిపోర్టును ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మనఊరు –మనబడి పథకంలో మంజూరై మధ్యలో నిలిచిపోయిన పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న సప్లిమెంటరీ బిల్లులను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్, శ్రీనివాసరెడ్డి, అరుణ భారతి, వెంకటయ్య, నాగేశ్వరరావు, ఆడం, వెలుగు రమేష్, సోమయ్య, చిలక రమేష్, లాలు, పాండురంగా చారి, బాల సైదిరెడ్డి, సాంబయ్య, శ్రీనివాస చారి పాల్గొన్నారు.

గిరిజనులను అన్ని రంగాల్లో చైతన్యం చేస్తాం



శిక్షణ తరగతులు నిర్వహించనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బెల్లయ్య నాయక్

సూర్యాపేట : ఆదివాసీలు, గిరిజనులను అన్ని రంగాల్లో చైతన్య చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఐదుగురు చొప్పున ఎంపిక చేసిన ఆదివాసీ, గిరిజనుల కాంగ్రెస్ ప్రతినిధులకు శిక్షణ తరగతులు ఈ నెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా గిరిజనులు, ఆదివాసీల చైతన్యం కోసం రాజకీయ శిక్షణా తరగతులు నిర్వ హించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఏఐసీసీ జాతీయ నేత రాహుల్‌గాంధీ పిలుపు మేరకు దేశంలో గిరిజన, ఆదివాసీల అభివృద్ధికి వారం రోజుల పాటు ట్రైనర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ తరగతుల ప్రారంభానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల కష్టాలు

- పల్లెల్లో తపాలా సేవలు అందక అవస్థలు
- వేతనాలు తీసుకునేందుకు దూరప్రాంతాలకు



సూర్యాపేటలోని తపాలాశాఖ కార్యాలయం

నాగారం : ఉపాధి పనులు చేసే కూలీలకు అందించే వేతనాలను అధికారులు పోస్టాఫీసుల్లో జమ చేస్తున్నారు. అయితే పల్లెల్లో తపాలా సేవలు అందుబాటులో లేకపోవడంతో కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు గ్రామాలకు పోస్టల్ సేవలు లేక ఉపాధి కూలీలు దూర ప్రాంతాలకు వెళ్లి వేతనాలు తీసుకోవాల్సి వస్తోంది. జనాభా పెరుగుతున్నా కొత్త వాటిని ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా.. ఆసరా పింఛన్లు, ఉపాధి కూలీ చెల్లింపులతో పాటు పలు రకాల చిన్న మొత్తాల పొదుపు పథకాలను పోస్టాఫీసుల ద్వారా అందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో పోస్టాఫీసులు లేకపోవడంతో పొదుపునకు అవకాశం ఉండడం లేదు. గ్రామాల్లో తపాలా సేవలు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో ఇలా...	
గ్రామ పంచాయతీలు	486
బ్రాంచ్ పోస్టాఫీసులు	319
సబ్ పోస్టాఫీసులు	29

నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లాలి



శాంతినగర్ గ్రామంలో సుమారు 700పైగా జనాభా ఉంటారు. గ్రామంలో పోస్టాఫీసు లేకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లిన వారు డబ్బులు తెచ్చుకోవాలంటే సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో పసునూర్ గ్రామానికి వెళ్లి తెచ్చుకోవాలి. పోస్టాఫీసుకు సంబంధించి ఏ పని ఉన్నా దూరం వెళ్లలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు మా గ్రామంలో తపాలా కార్యాలయం ఏర్పాటు చేయాలి.

– ఎస్‌కే యాకూబ్‌వలీ, శాంతినగర్

అవసరమున్న చోట ఏర్పాటు చేస్తాం



తపాలా కార్యాలయాల నుంచి అన్ని గ్రామాల ప్రజలకు పోస్టల్ సిబ్బంది ద్వారా సేవలు అందిస్తున్నాం. ఎక్కడైనా పోస్టాఫీసు అవసరమని ప్రజలు అడిగితే ఉన్నతాధికారులకు నివేదించి, కొత్త వాటి ఏర్పాటుపై చర్యలు తీసుకుంటాం.

– వల్లమూడి వెంకటేశ్వర్లు, తపాలా శాఖ సూపరింటెండెంట్, సూర్యాపేట

శ్రీలక్ష్మీ నారసింహుడికి విశేష పూజలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు నిత్యకల్యాణం జరిపించారు. సుప్రభాత సేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ పూర్తిగావించారు. అనంతరం గరుడవాహనంపై శ్రీస్వామివారిని ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి భక్తులు పాల్గొన్నారు.



ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా శ్రీలతారెడ్డి

మోత్కూరు : ఉచిత పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ప్రధానిగా నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు గూదె మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏ ఒక్క అవినీతి మచ్చ లేకుండా పాలన కొనసాగిస్తూ రాష్ట్రాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దాహంతో ప్రజలను అభివృద్ధికి దూరం చేస్తూ ఉచితాల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి గ్రామంలో మొక్కలు నాటారు. అదేవిధంగా గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. సమావేశంలో జిల్లా నాయకులు ఏనుగు జితేందర్ రెడ్డి, అండెం సుధాకర్‌రెడ్డి, భీముడి తిరుమలరెడ్డి, ఉపాధ్యక్షులు లెల్లల బాలనర్సయ్య, రాదారపు మల్లేషం, ప్రధాన కార్యదర్శి వేముల దశరథ, మండల ఎస్సీ మోర్చా కొంపెల్లి గణేష్, కోశాధికారి కడమంచి సైదులు, కార్యదర్శి బత్తిని సతీష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఈట్టబోయిన ఆంజనేయులు, నల్లపోగుల వెంకన్న, కక్కరేను మల్లేష్, ముక్కాముల గణేష్, ఆళ్ల శివప్రసాద్, నిలిగొండ జయమ్మ, మార్గం సుజాత, మహేశ్వరం నిఖిత, కల్పన, మహేష్, మచ్చగిరి, నరేష్, అజయ్, మత్స్యగిరి, కిరణ్, మౌలానా పాల్గొన్నారు.

నేడు జడ్జీలు బాధ్యతల స్వీకరణ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియామకమైన న్యాయమూర్తి ఆయేషా పర్వీన్ సోమవారం బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘకాల శిక్షణ అనంతరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్ తిరిగి బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. వారికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమానికి సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయులకు తనిఖీల బాధ్యతలు అప్పగించొద్దు



మాట్లాడుతున్న పబ్బతి వెంకటేశ్వర్లు

సూర్యాపేటటౌన్ : రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పనితీరును పర్యవేక్షించడానికి ఎస్జీటీ, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించి బాధ్యతలు అప్పగించడం సరికాదని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పబ్బతి వెంకటేశ్వర్లు, వేణు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నంబర్– 2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఓ వైపు ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలకు చర్యలు తీసుకుంటామని చెబుతూనే ఇలాంటి చర్యలకు తీసుకోవడం అనాలోచితమైన చర్యగా పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు సీహెచ్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, రమణ, సింహాద్రి, క్రాంతి కుమార్, వెంకటయ్య, యాదగిరి, లింగయ్య, ప్రభాకర్, దేవేందర్, నాగన్న పాల్గొన్నారు.



అన్నారం జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

50ఏళ్ల అపూర్వ కలయిక

తుంగతుర్తి : మండల పరిధిలోని అన్నారం జెడ్పీహెచ్‌ఎస్‌లో 1974–1975లో 8వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 సంవత్సరాల తర్వాత కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రంగారెడ్డి, అహల్య, హసనాబాదు సోమయ్య, రేసు సత్తయ్య, సుదర్శన్, సోమయ్య, లక్ష్మయ్య, పూర్వ విద్యార్థులు శేఖర్‌రెడ్డి, సోమిరెడ్డి, గోవర్ధన్, వెంకట్ రెడ్డి, అమృతరెడ్డి, సత్తిరెడ్డి, సత్తయ్య, యాదగిరి, పాల్గొన్నారు.

ముఖం చూపిస్తేనే సరుకులు

- అంగన్‌వాడీల్లో ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం
- జూలై 1 నుంచి అమలుకు సన్నాహాలు
- సరుకులు పక్కదారి పట్టకుండా కొత్త విధానం



తుంగతుర్తిలో పోషణ్ ట్రాకర్ ద్వారా ముఖ గుర్తింపు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

నాగారం : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పారదర్శకంగా సరుకులు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్) తీసుకొచ్చింది. సరుకులు పక్కదారి పట్టకుండా ముఖ గుర్తింపుతోనే అందజేస్తారు. గతంలో అంగన్‌వాడీ లబ్ధిదారులకు అందించే సరుకుల విషయంలో జాబితాలో పేర్లు ఒకరివి ఉంటే.. మరొకరికి సరుకులు ఇస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ పద్ధతికి స్వస్తి పలికేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలో ఈ విధానం అమలుకు ఐసీడీఎస్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూలై–1 నుంచి అంగన్‌వాడీ టీచర్లకు గతంలో అందజేసిన ఫోన్లలో పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా ఈ ముఖ గుర్తింపు విధానాన్ని అమలు చేయనున్నారు. దీనికి అనుగుణంగా యాప్‌ను అప్‌డేట్ చేశారు.

జిల్లాలో ఇలా...	
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	05
అంగన్‌వాడీ కేంద్రాలు	1,209
చిన్నారుల సంఖ్య	45,177
గర్భిణులు	5,220
బాలింతలు	4,286

మూడేళ్లలోపు చిన్నారులకు..

ప్రస్తుతం ముఖ గుర్తింపు విధానం 6 నెలల వయసు నుంచి 3ఏళ్ల లోపు చిన్నారులకు పంపిణీ చేసే అదనపు ఆహారమైన బాలామృతం, గుడ్లు పంపిణీకి మాత్రమే వర్తిస్తుంది. పోషణ్ ట్రాకర్ యాప్‌లో చిన్నారి లేదా తల్లి ఫొటో తీస్తారు. ఆధార్ కార్డులో ఉన్న వివరాలను పొందుపరుస్తారు. అలాగే 3ఏళ్లు దాటిన చిన్నారులకు ఇంటికి ఇచ్చే పోషకాహారాన్ని తల్లి ఫొటోను యాప్‌లో నమోదు చేసి పంపిణీ చేస్తారు. దీంతో పోషకాహారం పంపిణీ ఏమేర జరుగుతోందో అనేదానిపై జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల పర్యవేక్షణ సులువు కానుంది. కాగా జిల్లాలో ఇప్పటికే ప్రయోగాత్మకంగా పోషణ్ ట్రాకర్ ద్వారా యాప్‌లో నమోదు చేస్తున్నారు. కాగా జూలై 1 నుంచి అధికారికంగా అమల్లోకి రానుంది. ప్రస్తుతానికి నమోదు ఒక్కటే అయినప్పటికీ రానురాను ముఖగుర్తింపును విస్తరింపజేయనున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే ఆహారానికి కూడా ముఖ గుర్తింపు తప్పనిసరి చేయనున్నారు.

ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో..

జిల్లాలోని 5 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు కలిపి54,683 మంది నమోదై ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. సరుకులు అసలైన లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ గుర్తింపు హాజరును ప్రవేశపెట్టారు.

పారదర్శకత కోసమే..



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌ఆర్‌ఎస్‌తో లబ్ధిదారులకు పారదర్శంగా సరుకులు అందుతాయి. ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారా 6నెలల నుంచి 3ఏళ్లలోపు చిన్నారులకు అందిస్తున్న టేక్ హోమ్ రేషన్‌ను నిర్ధారణ పూర్వకంగా లబ్ధిదారులకు అందుతుంది. వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు అందజేసే సరుకులను ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదు చేస్తారు.

– నర్సింహారావు, జిల్లా సంక్షేమ అధికారి, సూర్యాపేట.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం బస్తాలు

చిట్యాల: చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామ శివారులో గల ఓ వ్యవసాయ పొలం వద్ద నిల్వ చేసిన పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఓ వ్యక్తి స్కూటీపై చిన్నకాపర్తితో పాటు వెంబాయి, బోయగుబ్బ, మొగిదిదొరి గ్రామాల్లో తిరుగుతూ రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి చిన్నకాపర్తి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలం వద్ద నిల్వ చేస్తూ వస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం పోలీసులు వ్యవసాయ పొలంపై దాడి చేసి సుమారు పది క్వింటాళ్ల(20 బస్తాలు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని నూకలుగా మార్చి కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

నల్లబెల్లం, పటిక పట్టివేత



పట్టుబడిన నల్లబెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కొండమల్లేపల్లి: కారులో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను శనివారం అర్ధరాత్రి ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలంలోని హైదరాబాద్‌లో రోడ్డులో చెన్నారం గేటు వద్ద శనివారం అర్ధరాత్రి వాహనాల తనిఖీల్లో భాగంగా ఎక్సైజ్ అధికారులు ఓ కారును ఆపి తనిఖీ చేస్తుండగా.. డిండి మండలం బొగ్గులతోనకు చెందిన బాలకోటి కారును అక్కడే వదిలి పరారయ్యాడు. కారులో 660 కిలోల నల్లబెల్లం(22 బస్తాలు), 10 కిలోల పటికను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కారును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐ రాకేష్, సిబ్బంది అయూబ్, శేఖర్ రెడ్డి, రమేష్ తదితరులున్నారు.

రైల్లో నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

వలిగొండ: రైల్లో నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండలం గొల్నేపల్లి సమీపంలో ఆదివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గొల్నేపల్లి-వలిగొండ గ్రామాల మధ్య రైల్లో నుంచి ఓ వ్యక్తి జారిపడి తీవ్రంగా గాయపడినట్లుగా రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. క్షతగాత్రుడి నుంచి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా. తన పేరు విజయ్ అని, తనది మహారాష్ట్రలోని ఉదగిర్ గ్రామమని చెబుతున్నట్లు రైల్వే ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. అతడి తల, కాలుకు తీవ్ర గాయాలవ్వడంతో పూర్తి వివరాలు చెప్పలేకపోతున్నాడని పేర్కొన్నారు. ఈ మే రకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు

అడ్డగూడూరు: వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై అడ్డగూడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన మేకల పవన్ శనివారం రాత్రి 11.30 గంటలకు ఇంటికి వెళ్తుండగా.. అడ్డగూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కొంతమంది గుమికూడటం గమనించి అక్కడకు వెళ్లాడు. ఈ క్రమంలో లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన కప్పల రాజేష్‌తో పాటు అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన గూడెపు నాగరాజు, గజ్జెల్లి రవి కలిసి పవన్‌పై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో పవన్ చేతికి గాయాలయ్యాయి. తనపై దాడి చేసి, కులం పేరుతో దుషించారని ఆదివారం పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాగుబడి



సున్నం వేయించక ముందు..



సున్నం వేయించిన తర్వాత..

రామన్నపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వలమల్ల జనార్దన్ తన సొంత ఖర్చులు రూ.11వేలతో పాఠశాలలోని తరగతి గదులు, ప్రహరీకి సున్నం వేయించి ఆదర్శంగా నిలిచారు. ఆయన గతేడాది జూలై 1న ఈ పాఠశాలకు బదిలీపై వచ్చారు. సహచర ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల సంఖ్యను 20 నుంచి 27కు పెరగడానికి కృషి చేశారు. - రామన్నపేట

పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

వలిగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. శనివారం రాత్రి వలిగొండ మండలం పులిగిళ్లలో సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వేముల మహేందర్ నాల్గవ వర్ధంతి కార్యక్రమానికి జాన్ వెస్లీ హాజరై మహేందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. సీపీఎం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంలో ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తుందని.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈవిధంగా ఉచిత విద్య, వైద్యం అందించగలరా అని ప్రశ్నించారు. మధ్యతరగతి ప్రజలు అప్పు చేసి విద్య, వైద్య సేవలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు పెద్దఎత్తున సహకరిస్తున్నాయని ఆరోపించారు. మహేందర్ ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీ జహంగీర్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, గణపతిరెడ్డి, నాయకులు కొమ్మిడి లక్ష్మారెడ్డి, వాకిటి వెంకటరెడ్డి, తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, కళ్లెం సుదర్శన్రెడ్డి, దొడ్డి భిక్షపతి, వేముల నాగరాజు, మారబోయిన నరసింహ, బుగ్గ అయిలయ్య, బుగ్గ చంద్రమౌళి, పైళ్ల వీరారెడ్డి, వడ్డమాని వెంకటయ్య, వడ్డెమాని మధు, బుగ్గ ఉదయ్, వేముల జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



రాజు (ఫైల్)



సత్యనారాయణ

బీబీనగర్: కారును వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటన బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా శనివారం రాత్రి జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరికి చెందిన తంగెళ్లపల్లి సత్యనారాయణచారి (50), భువనగిరికి చెందిన ఎర్రోజు రాజు(42) కలిసి పని నిమిత్తం శనివారం హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా.. బీబీనగర్ మండలం గూడూరు టోల్ ప్లాజా సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న కారును అదుపుతప్పి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సత్యనారాయణచారి, రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాజు మృతిచెందాడు. ఆస్పత్రికి చేరుకున్నాక సత్యనారాయణ మృతిచెందాడు. మృతుల కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మిన్నంటిన రోదనలు..

భువనగిరి: ఎర్రోజు రాజు, సత్యనారాయణచారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం ఉదయం ఆస్పత్రికి చేరుకోవడంతో వారి రోదనలతో మిన్నంటాయి. రాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకెళ్లారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ.. యువకుడి మృతి

- మరొకరికి గాయాలు

మిర్యాలగూడ అర్బన్: స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో ఎఫ్‌సీఐ గోదాం సమీపంలో ఆదివారం జరిగింది. వన్‌టౌన్ సీఐ మోతీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం శూన్యంపహాడ్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సాల్మాన్ మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఇటీవల అతడికి పెద్దవూరకు బదిలీ కావడంతో కుటుంబంతో కలిసి అక్కడికి షిఫ్ట్ అయ్యారు. ఈ క్రమంలో ఆదివారం సాల్మాన్ కుమారుడు అరుణ్(25), మరో వ్యక్తి రామకృష్ణ కలిసి స్కూటీపై సాగర్ రోడ్డు గుండా హాలియా వైపు వెళ్తుండగా.. ఎఫ్‌సీఐ గోదాం సమీపంలో వెనుక నుంచి ధాన్యం లోడుతో వస్తున్న లారీ స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. స్కూటీ వెనుక కూర్చున్న రామకృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ మోతీరాం ఘటనా స్థలానికి చేరుకుని అరుణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడిన కంటైనర్



నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై అడ్డంగా పడిన కంటైనర్

వేములపల్లి: కంటైనర్ లారీ డివైడర్‌ను ఢీకొనడంతో కంటైనర్ రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఈ ఘటన నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై వేములపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కంటైనర్ లారీలో డ్రైవర్లు కాశీప్రభ, విజయ్‌రాజ్ నల్లగొండ నుంచి తమిళనాడుకు వెళ్తున్నారు. మార్గమధ్యలో వేములపల్లి మండల కేంద్రానికి చేరుకోగానే డ్రైవర్ కాశీప్రభ నిద్రలోకి జారుకోవడంతో లారీ అదుపుతప్పి నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో లారీపై గల కంటైనర్ రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కాశీప్రభకు స్వల్ప గాయాలయ్యాయి. కంటైనర్ రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న వేములపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ల సహాయంలో కంటైనర్‌ను రోడ్డు పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్?

శాలిగౌరారం: మండల కేంద్రంలో గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం స్థానిక పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన వారిని విచారించగా.. కట్టంగూర్ మండలం నారెగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు కట్టంగూర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆదివారం రాత్రి నారెగూడెం వెళ్లి గంజాయి విక్రయిస్తున్న వారిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరు పోలీసులకు చిక్కలేదు. పట్టుబడిన వ్యక్తిని కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియరావల్సి ఉంది.

బోరు మోటార్ల వైర్లు చోరీ

మిర్యాలగూడ టౌన్: వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్ల వైర్లను గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశారు. ఈ ఘటన శనివారం రాత్రి మిర్యాలగూడ మండలం బోట్యానాయక్‌తండా పరిధిలో జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. బోట్యానాయక్‌తండాకు చెందిన రైతు, మాజీ సర్పంచ్ సాగర్‌నాయక్ శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో తన పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్తుండగా.. తన బోరు మోటారు వద్ద లైట్ వెలుగుతుడటం గమనించాడు. అక్కడికి వెళ్లి చూడగా గుర్తుతెలియని వ్యక్తి బోరు మోటారు వైరు చోరీ చేస్తూ కనిపించాడు. దీంతో సాగర్‌నాయక్ అతడిని నిలదీయగా ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. అనంతరం సాగర్‌నాయక్ బోరు మోటారు వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ బాక్స్‌లో ఫ్యూజు తొలగించడంతో పాటు మోటారు వైరును చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈవిధంగా తండా పరిధిలోని 30మంది రైతుల వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్ల వైర్లు చోరీకి గురవ్వడంతో ఆదివారం బాధిత రైతులంతా కలిసి మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తి వదిలి వేసిన వెళ్లిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు.

చిట్టీల పేరుతో మోసం

- కోటిన్నర రూపాయలతో ఉడాయించిన వ్యక్తి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన 40మందికి పైగా బాధితులు

మిర్యాలగూడ అర్బన్: అందరితో పరిచయాలు ఏర్పచుకుని, నమ్మకంగా ఉంటూ చిట్టీలు కట్టించుకున్న వ్యక్తి సుమారు కోటిన్నర రూపాయలతో ఉడాయించాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. శాంతినగర్‌లో నివాసముంటున్న ఓ వ్యక్తి కాలనీవాసులను నమ్మించి 40మందితో చిట్టీలు కట్టించుకున్నాడు. మొదట్లో చిట్టీ డబ్బులు బాగానే ఇచ్చిన ఆయన.. కొద్దిరోజులుగా చీటీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో చిట్టీలు పాడిన వారు అతడి ఇంటి వద్దకు వచ్చి చూడగా తాళం వేసి ఉండటంతో చుట్టుపక్కల వారిని వాకబు చేశారు. సదరు వ్యక్తి కొద్దిరోజులుగా కనిపించడంలేదని చుట్టుపక్కల వారు తెలపడంతో.. అతడి ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు మిర్యాలగూడ టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. సుమారు 40మందికి పైగా బాధితుల వద్ద కోటిన్నర రూపాయల వరకు వసూలు చేసి పారిపోయినట్లు తెలుస్తోంది. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సోమనర్సయ్య పేర్కొన్నారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు తెల్లవారు జామున ఉషాపద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆయా పూజల్లో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, కాసబోయిన సత్యనారాయణ, యాదగిరి, మణికంఠ, గిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, మోనూపాండే, శ్రీరాంపాండే తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డి ఎంతో ప్రతిభావంతుడు

- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



ప్రభాకర్‌రెడ్డి సినీ జీవితంపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లాకు చెందిన దివంగత నటుడు, దర్శక-నిర్మాత డాక్టర్ ఎం. ప్రభాకర్‌రెడ్డి ఎంతో ప్రతిభావంతుడని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ప్రభాకర్‌రెడ్డి సినీ జీవితంపై నల్లగొండ ఫిలిం సొసైటీ సెక్రటరీ పున్నమి అంజయ్య రచించిన పుస్తకాన్ని ఆదివారం గుత్తా సుఖేందర్‌రెడ్డి నల్లగొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినీ కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేసిన ఎం. ప్రభాకర్‌రెడ్డికి తెలుగు చిత్ర పరిశ్రమలో సరైన గౌరవం దక్కలేదని అన్నారు. ప్రభాకర్‌రెడ్డి సినీ జీవితం గురించి పుస్తకం వెలువరించడం అభినందనీయమన్నారు. పుస్తక రచయిత పున్నమి అంజయ్య మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన దివంగత నటులు కత్తి కాంతారావు, ఎం. ప్రభాకర్‌రెడ్డిలను గుర్తుచేసుకోకపోవడం ఎంతో బాధాకరమన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన కత్తి కాంతారావు, ఎం. ప్రభాకర్‌రెడ్డి, హాస్యనటుడు వేణుమాధవ్ కుటుంబ సభ్యులకు రూ.కోటి, 500 గజాల స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిలిం సొసైటీ సభ్యులు ఫణీ, విద్యాసాగర్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి, కోమలి కళాసమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, సభ్యులు వంగూరు భాస్కర్, తేజస్విని, సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పెండోట సోము, ప్రముఖ కవి రచయిత డాక్టర్ సాగర్ల సత్తయ్య, ఉనికి సంస్థ అధ్యక్షుడు బండారు శంకర్, విశ్వకర్మ సేవా సమితి కన్వీనర్ పగిడిమర్రి వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

- ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న సంతోషిమాత దేవస్థాన కమిటీ సభ్యులు

సూర్యాపేట: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని శ్రీసంతోషిమాత దేవస్థానంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులు ఎక్కువ స్థానాల్లో నిలబడి గెలిచి ప్రజలకు మరింత సేవలందించాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. పేద ఆర్యవైశ్యులకు, ఆర్యవైశ్య విద్యార్థులకు సహాయం అందించాలన్నారు. ఈ సందర్భంగా సంతోషిమాత దేవస్థాన కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంతోషిమాత దేవస్థాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బ్రాహ్మణపల్లి మురళీధర్, నూక వెంకటేశం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండారు రాజా, ఉపాధ్యక్షుడు గోపారపు రాజు, కోశాధికారి చెల్లా లక్ష్మీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఊరే లక్ష్మణ్, పప్పా ప్రకాష్, భువనగిరి విజయ్‌కుమార్, కొత్త మల్లికార్జున్, రాచర్ల కమలాకర్, వెంకటేశ్వర్లు, గుడిపాటి రమేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వెంచర్ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు

- ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశారని బాధితుల ఆరోపణ



చిట్యాల పోలీస్ స్టేషన్ ఎదుట బాధితులు

చిట్యాల: ఐదేళ్ల క్రితం ప్లాట్లు విక్రయించి అగ్రిమెంట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐదేళ్ల క్రితం చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో శ్రీనివాస టౌన్‌షిప్(కార్తికేయ వెంచర్) పేరుతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ ఏర్పాటు చేశారు. ఆ టౌన్‌షిప్‌లో చిట్యాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 30మంది వరకు ప్లాట్లు కొనుగోలు చేసి వెంచర్ డెవలపర్స్‌తో అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇందుకుగాను ఒక్కొక్కరు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు టౌన్‌షిప్ నిర్వాహకులకు ఇచ్చారు. అనంతరం వెంచర్ డెవలపర్లు వివిధ కారణాలను చూపుతూ కొనుగోలు చేసిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా జాప్యం చేస్తూ వస్తున్నారు. ఇటీవల ఆ వెంచర్‌లో ప్లాట్లకు రేట్లు పెరగడంతో ఇప్పటికే అగ్రిమెంట్ చేసుకున్న వారికి కాకుండా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపిస్తూ.. ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఆ వెంచర్‌లో ఆదివారం సమావేశమయ్యారు. అనంతరం తమను మోసం చేసిన వెంచర్ డెవలపర్స్‌పై తగిన చర్యలు తీసుకోవాలని చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బత్తుల జనార్దన్, లింగస్వామి, అయిలయ్య, సత్యనారాయణలతో మరికొందరు ఉన్నారు.

బాతులే జీవనాధారం



భీమనపల్లి సమీపంలో రోడ్డు వెంట వెళ్తున్న బాతుల సమూహం

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలంలోని మూసీ పరీవాహక గ్రామాల్లో ఎక్కడ చూసినా బాతులు సందడి చేస్తున్నాయి. ప్రతిఏటా వరికోతలు పూర్తవ్వగానే ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, గుంటూరు తదితర జిల్లాల నుంచి పదుల కొద్ది కుటుంబాలు బాతు పిల్లలను తీసుకొని భూదాన్‌పోచంపల్లి మండలానికి వస్తుంటారు. మూసీ పరీవాహకంలోని కాలువలు, పొలాలలో బాతులను మేపుతూ వాటిని పెద్దచేసి గుడ్లు పెట్టే దశకు పెంచుతారు. రెండు నెలల పాటు ఇక్కడే ఉండి బాతు గుడ్లను సేకరించి మధ్యవర్తుల ద్వారా గుడ్లను ఉత్తరాది రాష్ట్రాలకు రవాణా చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

ఐదు దశాబ్దాల తర్వాత ఆత్మీయ కలయిక



సూర్యాపేట: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



గరిడేపల్లి: గురువును సన్మానించిన పూర్వ విద్యార్థులు

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో 1969లో హెచ్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. 56 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలుసుకొని ఆనందంగా గడిపారు. ఆనాడు తమకు చదవు చెప్పిన గురువులు ఒంటెద్దు వెంకట్‌రెడ్డి, ఎస్. సత్యనారాయణను ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ, రిటైర్డ్ టీచర్ గుండా రమేష్, పూర్వ విద్యార్థులు ప్రభాకరాచారి, వెంపటి వెంకన్న, అంజని, శ్రీనివాసరావు జయాకర్, వి. సూర్యనారాయణ, భాస్కర్, సుబ్రహ్మణ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

41 ఏళ్ల తర్వాత..

గరిడేపల్లి: గరిడేపల్లి మండల పరిధిలోని కల్మలచెరువు జెడ్పీహెచ్ఎస్‌లో 1982-83 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 41ఏళ్ల తర్వాత ఒకచోట చేరి వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మూలగుండ్ల సీతారాంరెడ్డి, ఈగ శ్రీనివాసరావు, కృష్ణ, ఒంటెద్దు వెంకట్‌రెడ్డి, బండారు పిచ్చయ్య, నలబోలు సైదిరెడ్డి, ధనమ్మ, అలుగుబెల్లి సైదిరెడ్డి, గుమ్మిత నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.